కొడంగల్‌లో 16 మంది రైతుల అరెస్టు

- కరెంట్ బందు చేసి, ఇంటర్నెట్ కట్ చేసి తలుపులు బద్దలు కొట్టి.. రైతులకు సంకెళ్లు
- గ్రామం వైపు ఎవరినీ వెళ్లనీయకుండా కట్టడి
- తెల్లారితే కొడుకు పుట్టినరోజు వేడుకలు
- మరునాడే కూతురు అన్నప్రాసన వేడుక
- వేడుకలు చేసుకోనీయకుండా అరెస్టులు

మహబూబ్‌నగర్ ప్రతినిధి/కొడంగల్/పరిగి, నవంబర్ 12: అర్ధరాత్రి వేళ.. కరెంట్ సరఫరా నిలిపేసి.. ఇంటర్నెట్ సేవలు బంద్ చేసి.. ఇండ్ల తలుపులు బద్దలు కొడుతూ.. ఇల్లిల్లూ సోదాలు చేసి.. సుమారు 300 మంది పోలీసులు 55 మందిని పట్టుకొని బంధించారు. పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విచారణ అనంతరం 16 మంది రైతులకు కోర్టుకు రిమాండ్ చేశారు. వారికి 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధిస్తూ కోర్టు తీర్పు ఇవ్వగా, పరిగి సబ్ జైలుకు తరలించారు. వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్ల గ్రామంలో సోమవారం అధికారులపై దాడి ఘటనపై ఆ అర్ధరాత్రి నుంచే ఇలా పోలీస్ యాక్షన్ షురూ అయింది. ఆ రాత్రంతా ఆ ఊరితో పాటు రోటిబండ తండాలో కాళరాత్రి రాజ్యమేలింది. ఉదయం దాడి ఘటన తర్వాత పిల్లాజెల్లా ఇండ్లలో ఉండగా, అర్ధరాత్రి పోలీస్ బూటు చప్పుళ్లతో ఒక్కసారిగా ఆ ఊళ్లు ఉలిక్కిపడ్డాయి. ఫార్మా కంపెనీలకు భూసేకరణ విషయంలో సోమవారం లగచర్లకు వచ్చిన కలెక్టర్, అదనపు కలెక్టర్, కడా ప్రత్యేకాధికారిపై దాడి తర్వాత పోలీసులు గ్రామంలో భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. అర్ధరాత్రి నుంచే ఈ గ్రామాల వైపు ఎవరినీ వెళ్లనీయకుండా కట్టుదిట్టమైన భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. దాడితో తమకేమీ సంబంధం లేదని మొత్తుకుంటున్నా పోలీసులు పట్టించుకోలేదు. దొరికిన వారు దొరికినట్టుగా అనుమానంతో సుమారు 55 మంది అదుపులోకి తీసుకున్నారు. వారిని పరిగి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు విచారణ జరిపారు. దాడి సందర్భంగా వివిధ టీవీ చానళ్లు, సోషల్ మీడియాలో వచ్చిన వీడియోల్లో ఉన్నవారిని గుర్తించాలంటూ వారి నుంచి వివరాలను రాబట్టారు.

తెల్లారితే కొడుకు మొదటి బర్త్‌డే

ఇద్దరు ఆడపిల్లల తరువాత కొడుకు పుట్టిండు. పెద్ద ఎత్తున సంతోషంగా మొదటి పుట్టినరోజు జరుపుకోవాలని సంబురపడ్డాం. 10 రోజుల నుంచి అన్ని ఏర్పాట్లు చేసుకుంటూ చుట్టాలను పిలుచుకున్నం. అధికారులపై దాడి జరిగిందని, అర్ధరాత్రి ఇంటికొచ్చిన పోలీసులు నా భర్తను తీసుకెళ్లారు. గొడవకు ఆయనకు ఎటువంటి సంబంధం లేదు. కార్యక్రమం ఆగిపోయి కొడుకు పుట్టినరోజు సంబురం లేకుండా చేశారు. నా భర్త కోసం బొంరాస్‌పేట పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాను. కానీ పోలీసులు లేడని చెప్పారు. ఇప్పుడ ఆయన ఎక్కడ ఉన్నాడో తెలియదు. ఎప్పుడు వస్తాడో తెలియదు. మాకు భూమి లేదు. గొడవతో సంబంధమూ లేదు.

- భాత్యశ్రీ, లగచర్ల, దుద్యాల మండలం

పూర్తిస్థాయి విచారణ అనంతరం దాడిలో పాల్గొన్న వారిపై కేసు నమోదు చేశారు. మిగతా వారిని వదిలిపెట్టారు. దాడిలో పాల్గొనని వారిని సైతం పోలీసులు అదుపులోకి తీసుకోవడం విమర్శలకు తావిచ్చింది. ఆ సమయంలో అసలు గ్రామంలో లేని వారిని అదుపులోకి తీసుకోవడం ఏమిటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. లగచర్లలో కలెక్టర్‌పై దాడి కేసును పోలీసు ఉన్నతాధికారులే స్వయంగా పర్యవేక్షించారు.

రోటిబండ తండాలో తాళం వేసి ఉన్న ఓ ఇల్లు

పోలీసుల ప్రతాపం

వికారాబాద్ ఎస్పీ ఆధ్వర్యంలో దాదాపు 300 మంది పోలీసులు అర్ధరాత్రి పూట వాహనాల్లో తండాకు దూసుకొచ్చారు. తండాలో కనిపించిన ఇండ్ల తలుపులు బాది, బెదిరించి దుర్భాషలాడుతూ, ఇతర కుటుంబ సభ్యుల ముందే కొట్టుకుంటూ పలువురిని లాక్కెళ్లారు. తమ వాళ్లు లేరని చెప్పినా వినకుండా బాత్రూంలో, ఇతర ప్రదేశాల్లో టార్చ్‌లైట్లు వేసి మరీ వెతికారు. సమీపంలోని పొలాల వద్ద కూడా జల్లెడ పట్టారు. కనపడిన వారందరినీ వెంట తీసుకొచ్చి డీసీఎం వాహనాల్లో ఎక్కించి పరిగి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనతో ఒక్కసారిగా స్థానికులు ఉలిక్కిపడ్డారు. ఏం జరుగుతుందోనని తెలుసుకొనేలోపు మగవాళ్లందరినీ అదుపులోకి తీసుకున్నారు. దీంతో లగచర్ల గ్రామంలో కర్ఫ్యూ వాతావరణం తలపించింది.

ఇంటర్‌నెట్ బంద్ చేసి..

సాధారణంగా మత కలహాలు, ఇతర పెద్ద నేరాలు జరిగిన సమయంలో సంబంధిత ప్రాంతాల్లో ఇంటర్‌నెట్ సేవలను బంద్ చేస్తుంటారు. కానీ లగచర్లలో రైతుల నిరసన సమయంలో జరిగిన దాడి ఘటనపై పరిసర మండలాల్లో సైతం ఇంటర్‌నెట్ సేవలను బంద్ చేశారు. దుద్యాల, కొడంగల్, బొంరాస్‌పేట్ మండలాల్లో అధికారులు పూర్తిగా ఇంటర్‌నెట్ సేవలను నిలిపివేశారు. ఫార్మా కంపెనీలు ఏర్పాటు చేయతలపెట్టిన లగచెర్లతోపాటు హకీంపేట, పోలేపల్లి, రోటిబండ తండా, పులిచెర్లకుంట తండాల్లో మంగళవారం నిశ్శబ్ద వాతావరణం నెలకొన్నది. పలు ఇండ్లకు తాళాలు వేసి కనిపించాయి.

లగచర్లకు ఎవరూ వెళ్లకుండా అడ్డంకులు

దుద్యాల మండలం లగచర్ల బాధితులకు సంఘీభావం ప్రకటించడానికి వస్తున్న బీఆర్ఎస్ బృందాన్ని పోలీసులు అడ్డుకున్నారు. లగచర్ల వైపు ఎవరూ వెళ్లకుండా చెక్‌పోస్టులు పెట్టి వాహన తనిఖీలు చేపట్టారు. పరిగి, మన్నెగూడతోపాటు ఇతర చోట్ల చెక్‌పోస్టులు ఏర్పాటుచేశారు. హైదరాబాద్ నుంచి లగచర్లకు బయలుదేరిన శాసనమండలిలో విపక్ష నేత మధుసూదనాచారి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, వికారాబాద్, కొడంగల్, పరిగి మాజీ ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్, పట్నం నరేందర్‌రెడ్డి, కొప్పు ల మహేశ్‌రెడ్డి, బీసీ కమీషన్ మాజీ సభ్యుడు శుభప్రద్‌పటేల్, రాష్ట్ర నేత కార్తీక్‌రెడ్డిని పోలీసులు మన్నెగూడలోనే అడ్డగించి అరెస్టు చేశారు.

బాధ్యులపై చట్టపరమైన చర్యలు: ఎస్పీ

దుద్యాల మండలం లగచర్లలో కలెక్టర్, ఇతర అధికారులపై జరిగిన దాడికి బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి పేర్కొన్నారు. లగచర్లలో అధికారుల ప్రజాభిప్రాయ సేకరణ సమయంలో బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. సమావేశ స్థలానికి రైతులెవరూ రాకపోవడంతో కలెక్టర్ అధికారులతో కలిసి లగచర్లకే వెళ్లారని, వెళ్లాక గ్రామస్థులు అధికారులపై ముప్పేట దాడి చేశారని తెలిపారు.

16 మందికి రిమాండ్

లగచర్లలో అధికారులపై దాడి ఘటనపై పోలీసులు అరెస్టు చేసిన 16మందిని కొడంగల్‌లోని ఫస్ట్‌క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ శ్రీరాం ఎదుట హాజరుపరచగా, 14 రోజుల రిమాండ్ విధించారు. వారిని పరిగి సబ్ జైలుకు తరలించారు. అంతకు ముందు పరిగి ప్రభుత్వ దవాఖానలో వారికి వైద్య పరీక్షలు చేయించి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

తెల్లారితే కూతురికి అన్నప్రాసన

కూతురుకు అన్న ప్రాసన నిర్వహించే కార్యక్రమంలో నా భర్త నరేందర్‌గౌడ్ ఏర్పాట్లు చేస్తున్నాడు. సోమవారం తాండూరుకు వెళ్లి పనులు చూసుకొని రాత్రి ఇంటికి వచ్చాడు. గొడవతో నా భర్తకు ఎటువంటి సంబంధం లేదు. అర్ధరాత్రి పోలీసులు ఇంటి తలుపులు కొట్టి నిద్రలేపి ఉన్నపళంగా లాక్కొని పోయారు. మాకు ఎటువంటి భూమి లేదు. మాకు గౌరారంలో భూమి ఉన్నది. నా పెద్ద కూతురు ప్రాణం బాగాలేదు. ఇంట్లో మగవాళ్లు ఎవరూ లేదు. ఇప్పుడు ఏం చేయాలో అర్థం కావడం లేదు.

- అద్విక, లగచర్ల, దుద్యాల మండలం

ఆడోళ్లని కూడా చూడలే..

అర్ధరాత్రి ఒక్కసారిగా 300 మంది పోలీసులు తండాకొచ్చి ఆడోళ్లని కూడా చూడకుండా ఇష్టం వచ్చినట్టు ప్రవర్తించారు. ఇంట్లో ఎవరున్నారు.. అంటూ జొరబడి ఆడోళ్లపైనా ఇష్టం వచ్చినట్టుగా చేతులు వేసి ఇబ్బంది పెట్టారు. చెప్పుకోవడానికి సిగ్గుపడుతున్నాం. రాత్రి పూట వచ్చి భయపెట్టారు.10 నెలలుగా ఫార్మా కంపనీతో భయపడుతూనే కాలం గడుపుతున్నాం. భూములు పోతే ఏంచేయాలి.మా భూములు గుంజుకోవడం ఎంతవరకు సమంజసం.

–సక్రిబాయి. రోటిబండ తండా, దుద్యాల మండలం

కడా అధికారికి నిమ్స్‌లో చికిత్స

వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్లలో దాడి ఘటనలో గాయపడిన కడా అధికారి నిమ్స్‌లో చికిత్స తీసుకున్నారు. కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడా) చైర్మన్‌గా పనిచేస్తున్న వెంకట్‌రెడ్డి సోమవారం జరిగిన దాడి ఘటనలో గాయపడ్డారు. ఆయన నిమ్స్‌లో చికిత్స తీసుకొని వెళ్లిపోయినట్టు వైద్యులు తెలిపారు.

వైద్యం కోసమొచ్చి పోలీసుల చేతచిక్కి

పొట్టకూటి కోసం ముంబైకి వెళ్లి బతుకుతున్నా. ఏడాదికి ఒకసారి తండాకు వెచ్చి వెళ్తం. భర్త చనిపోయిండు. ఆరోగ్యం బాగలేక నా కొడుకుతో కలిసి నాలుగు రోజుల క్రితం తండాకొచ్చిన. జరిగిన దాడిలో నా కొడుకు వినోద్‌కు సంబంధమే లేదు. అర్ధరాత్రి కరెంటు లేని సమయంలో పోలీసులు ఇంటి తలుపులు కొట్టి కొడుకును పోలీసులు తీసుకెళ్లారు. కాల్మొక్త.. నా కొడుకును నాకు అప్పగించండి.

-మున్నీబాయి, రోటిబండ తండా, దుద్యాల మండలం

మా భూములే కావాల్నా?

రేవంత్‌రెడ్డి శానా మంచిగ చేసిండు. ఏం దాడి.. తెల్లార్లు నిద్రల్లేవు.. అర్ధరాత్రి మా పోళ్లను ఏసుకోపోయిండ్రు. ఇల్లు కూడా కూలగొడతారేమో? కూల గొట్కోపో.. ఆయన్ను (రేవంత్‌ను) గెలిపించినందుకు ఈ దారి చూపిస్తున్నాడా? మాతానే ఉండదా? భూమి ఎక్కడ్లేదా? ఈడనే ఉందా? మేం ఇంతనో, అంతనో చేసుకుంటున్నాం. వానలు పడితే పంటలు పండుతాయి. లేకపోతే ఎండుకుపోతాయి. మా భూములు కావాల్సి వచ్చినయా?

- గోగిబాయి, రోటిబండ తండా, దుద్యాల

మందిని ముంచనికె గూసున్నవు

భూములు గుంజుకొని ఫార్మా కంపెనా? మందిని ముంచెనికే గూసున్నవ్.. అయితే మేం సావాల్నా? మేం సచ్చినంకనే కంపెనీ ఏస్కో.. సీఎం అయినందుకే మమ్మల్ని గిట్ల చేస్తున్నడు. ఊరినే ముంచుతాడని మాకేం తెలుసు. గిసోంటి పని చేస్తడని అనుకున్నమా? ఊర్లు మింగుతున్నారు. మా పిల్లలు గింత చిన్నగున్నప్పుడు బొంబాయికి పోయి.. కన్న కష్టం చేసి ఈ భూమి కొన్నం. ఫార్మా కంపెనీ వద్దు. దవాఖాన పెట్టు. పిల్లలకు స్కూల్ కట్టు.. గిదేం పని.

- లక్ష్మీబాయి, లగచర్ల, దుద్యాల మండలం

లోకం పోకడ



ఆయన అన్నది మనగురించి కాదు గొర్రెబావా, మరాఠీ గొర్రెల గురించి!

ఇంటెలిజెన్స్ వైఫల్యమే!

లగచర్ల ఘటనపై శ్రీధర్‌బాబు సీరియస్

ఐజీ, వికారాబాద్ ఎస్పీపై మంత్రి ఆగ్రహం

ఆగ్రహంగా ఉన్న రైతుల వద్దకు ఎందుకెళ్లారని నిలదీత

పునరావృతమైతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక

హైదరాబాద్, నవంబర్ 12 (నమస్తే తెలంగాణ): వికారాబాద్ జిల్లా లగచర్ల ఘటనపై ఐటీ, పురపాలకశాఖ మంత్రి శ్రీధర్‌బాబు సీరియస్ అయ్యారు. ఇదీ ముమ్మాటికీ ఇంటెలిజెన్స్ వైఫల్యమేనని అసహనం వ్యక్తం చేసినట్టు సమాచారం. మంగళవారం వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్, మల్టీజోన్-2 ఐజీ సత్యనారాయణ, ఎస్పీ నారాయణరెడ్డి తదితర ఉన్నతాధికారులు రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబుతో సచివాలయంలోని ఆయన చాంబర్‌లో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సోమవారం నాటి లగచర్ల ఘటనపై ఆరా తీశారు. ఫార్మా కంపెనీకి భూములిచ్చే రైతాంగం ఆగ్రహంగా ఉన్నప్పటికీ ఇంటెలిజెన్స్ పోలీసులు ఎందుకు సమాచారం అందించలేదని నిలదీసినట్టు వినికిడి. ఓ వ్యక్తి చెప్పిన మాటలు నమ్మి గుడ్డిగా రైతులు దీక్ష చేస్తున్న ప్రాంతానికి కలెక్టర్ ఎందుకు వెళ్లారు? ఇందుకు పోలీసులు ఎందుకు అనుమతించారు? అని ప్రశ్నల వర్షం కురిపించినట్టు విశ్వసనీయంగా తెలిసింది. రైతుల భూములను గుంజుకుంటామని ఎందుకు ప్రకటించారని కొడంగల్ ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డిని ఉద్దేశించి మండిపడ్డట్టు సమాచారం. మరోసారి ఇలాంటి ఘటనలు జరిగితే ఊపేక్షించబోమని హెచ్చరించినట్టు అక్కడి వర్గాల ద్వారా తెలిసింది. కాగా, మంత్రి శ్రీధర్‌బాబు ఆగ్రహం వ్యక్తంచేయడంతో ఉన్నతాధికారులు ముభావంగా అక్కడి నుంచి వెనుదిరిగి వెళ్లిపోయారు.

లగచర్ల ఘటనపై సమగ్ర విచారణ

వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని లగచర్లలో సోమవారం జరిగిన ఘటనపై సమగ్ర విచారణ చేపడతామని మున్సిపల్, ఐటీ శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రకటించారు. కొందరు కుట్రపూరితంగా అమాయకులైన అక్కడి రైతులను ఉసిగొల్పి ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లిన కలెక్టర్‌పై దాడి చేయించారని ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో అభ్యంతరాలుంటే చెప్పవచ్చని, హింసకు తావులేదని ఖండించారు. ఇలాంటి ఘటనలను ప్రభుత్వం ఎట్టిపరిస్థితుల్లో ఉపేక్షించబోదని తేల్చిచెప్పారు. మంగళవారం సీఎల్పీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను అడ్డుకున్నవారిని వదిలిపెట్టబోమని హెచ్చరించారు. లగచర్ల ఘటనకు సంబంధించి పోలీసు అధికారుల వైఫల్యముంటే విచారణ చేపట్టి బాధ్యులపై కూడా చర్యలకు ఉపక్రమిస్తామని స్పష్టం చేశారు. యంత్రాంగంలోనూ లోపాలుంటే సరిదిద్దుకుంటామని చెప్పారు.

వికారాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఉద్యోగ సంఘాల నాయకులు

మన్యంలో మనసు గెలిచిన ప్రతీక్

గిరిజన గూడెల్లో 'ప్రతీక్' మార్పు • ఏజెన్సీ గ్రామాలకు త్రీఫేజ్ వెలుగులు

'గిరిజన దర్బార్'లో సమస్యల పరిష్కారం • భద్రాచలం ఐటీడీఏ పీవోగా మార్కు

కరెంటు సరఫరా అందించడంతో పీవో ప్రతీక్ జైన్‌ను కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న వాగొడ్డుగూడెం, సూరంపేట గిరిజనులు (ఫైల్)

భద్రాచలం, నవంబర్ 12 : ప్రతీక్ జైన్.. ప్రస్తుత వికారాబాద్ కలెక్టర్.. ఒకప్పటి భద్రాచలం ఐటీడీఏ పీవో. ఆయన పీవోగా బాధ్యతలు చేపట్టిందే తడవుగా మన్యం అభివృద్ధికి కంకణం కట్టుకున్నారు. కటిక చీకట్లో మగ్గిపోయిన గూడేలకు విద్యుత్ వెలుగులు ప్రసరింపజేయడం.. విద్యాభివృద్ధికి గురుకుల వ్యవస్థను బలోపేతం చేయడం.. ప్రతి సోమవారం గిరిజన దర్బార్‌లో బాధితుల అర్జీలను త్వరితగతిన పరిష్కరించడం.. ఇలా తన మార్కును చాటుకున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ సహకారంతో పీవోగా ఎన్నో మంచి పనులు చేసిన ప్రతీక్.. ఇపుడు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన తప్పిదానికి వికారాబాద్ కలెక్టర్‌గా తన పనితీరుపై మాయనిమచ్చ తెచ్చుకోవాల్సి వచ్చింది.

11 నెలల కాలంలోనే...

2023, జూలై 15 నుంచి 2024, జూన్ 12 వరకు ప్రతీక్ జైన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం ఐటీడీఏ పీవోగా విధులు నిర్వర్తించారు. 11 నెలల కాలంలోనే గిరిజనుల అభివృద్ధికి ఎనలేని సేవలందించారు. అశ్వారావుపేట మండలం వాగొడ్డుగూడెంతోపాటు సూరంపేట గ్రామాలకు ప్రత్యేక చొరవ చూపి ఐటీడీఏ నిధులు రూ.11 లక్షల వ్యయంతో విద్యుత్ సౌకర్యం కల్పించారు. దీంతో ఆయా గ్రామాల గిరిజనులు ఐటీడీఏకు వచ్చి ప్రతీక్ జైన్‌ను సత్కరించారు. దుమ్ముగూడెం మండలం ఎన్.లక్ష్మీపురం, సింగవరం గ్రామాల గిరిజన రైతుల పంట పొలాల్లో త్రీఫేజ్ విద్యుత్ కోసం ఆ శాఖ అధికారులతో మాట్లాడారు. ఐటీడీఏ నుంచి 117 మంది గిరిజన రైతులకు 11కేవీ విద్యుత్ లైన్ ఇవ్వడంతోపాటు త్రీఫేజ్ సౌకర్యం కల్పించారు. ఐటీడీఏ పరిధిలోని గిరిజన గ్రామాలన్నింటికీ త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యం కల్పించి పీవోగా తమ మార్కును చాటుకున్నారు. ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలను నిరంతరం పర్యవేక్షిస్తూ విద్యార్థులు చదువులో ముందుండేలా వారిని ప్రోత్సహించారు. విద్యార్థుల ఆరోగ్యం కోసం రాగిజావతోపాటు అల్పాహారం కూడా ఏర్పాటు చేయించారు. గిరిజన ఆచార వ్యవహారాలు, సంస్కృతీ సంప్రదాయాలపై పీవో ప్రతీక్ జైన్‌కు మక్కువ ఎక్కువ. గిరిజనుల ఆహార అలవాట్లను పాటిస్తూ.. తాను సైతం సొరకాయ బుర్రలో మంచినీటిని తాగిన సందర్భాలున్నాయి. ఐటీడీఏలో ప్రతీ సోమవారం నిర్వహించే గిరిజన దర్బార్ పీవో ప్రతీక్ జైన్ హయాంలోనే గుర్తింపు తెచ్చుకుంది. పీవోకు వివరించిన సమస్యను వెనువెంటనే పరిష్కరించేలా అధికారులకు హుకుం జారీ చేసేవారు. గిరిజన దర్బార్‌కు వచ్చే గిరిజనులకు మజ్జిగ, రాగిజావ స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు.

గిరిజన గ్రామాలకు వెలుగులిచ్చారు..

ప్రతీక్ జైన్ పీవోగా పనిచేసిన కాలంలో గిరిజన గ్రామాల్లో విద్యుత్ వెలుగులు వచ్చాయి. గిరిజనులు కరెంటులేదని పీవోకు పలుమార్లు విన్నవించారు. ఆ సందర్భంగా పీవో పిలిచి కరెంటు సౌకర్యం కల్పించాలి అని చెప్పారు. ఆ దిశగా ఏర్పాట్లు చేసి కరెంటు ఇచ్చాం. ఇలాంటి అధికారిపై దాడి జరగడం బాధాకరం.

- ఎస్‌డీ.మునీర్ పాషా, ఐటీడీఏ పవర్ ఏఈ, భద్రాచలం

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేవారు

ఐటీడీఏ పీవోగా గిరిజనుల అభివృద్ధికి కృషి చేసిన ప్రతీక్ జైన్.. ఉద్యోగులను కంటికి రెప్పలా కాపాడుకునేవారు. అందరితో కలుపుగోలుగా ఉండే ప్రతీక్‌జైన్‌పై దాడికి దిగడం సరికాదు. ఈ దాడిని టీఎన్‌జీవోస్ తరపున ఖండిస్తున్నాం.

-దెక్కా నర్సింహారావు, టీఎన్జీవోస్ అధ్యక్షుడు, భద్రాచలం

ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు

భద్రాచలం ఐటీడీఏ పీవోగా వచ్చిన సమయంలో గిరిజనుల అభివృద్ధికి ప్రతీక్ జైన్ విశేష కృషి చేశారు.గిరిజనులు సమస్య అని వస్తే నేరుగా రమ్మనేవారు. ఇలాంటి అధికారిపై దాడులు చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థకు గొడ్డలిపెట్టు.

-పూనెం కృష్ణదొర, ఆదివాసీ నాయకుడు, భద్రాచలం

రైతుల ఆందోళనకు రాజకీయ రంగు

- ఫార్మా బాధిత అన్నదాతల ఆందోళనలు పక్కదారిపట్టించే యత్నం
- బీఆర్ఎస్ నేతలను కుట్రలోకి లాగే పన్నాగం
- కేటీఆర్, నరేందర్‌రెడ్డి ఫోన్‌లో మాట్లాడుకున్నట్టు తప్పుడు ప్రచారం
- అనుకూల మీడియాకు పోలీసుల లీకులు
- సీఎస్‌కు పోలీసుశాఖ రహస్య నివేదిక?

హైదరాబాద్, నవంబర్ 12 (నమస్తే తెలంగాణ): 'మా భూములు మాకే కావాలి' అని పోరాటం చేస్తున్న రైతులపై ప్రభుత్వం కుట్ర చేస్తుందా ? స్వచ్ఛందంగా చేస్తున్న ఆందోళనలకు పార్టీల రంగు పులుముతుందా? భూములు ఎక్కడ కోల్పోతామోనని మా బిడ్డలే అధికారులపై తిరగబడ్డారని చెబుతున్నా కూడా.. ఆ దాడిని బీఆర్ఎస్‌కు అంటగట్టే ప్ర యత్నం చేస్తుందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తున్నది. ఫార్మా ఆందోళనలు పక్కదారి పట్టించేలా కాంగ్రెస్ ప్రభుత్వ అనుకూల మీడియా మొత్తం మంగళవారం ఉదయం నుంచే కక్షకట్టి అనుకూలమైన వార్తలను వండి వార్చుతున్నది. అర్ధరాత్రి నుం చి తెల్లవారుజాము వరకూ వందలామంది పోలీసులు బాధిత గ్రామాలపై దండయాత్ర చేసి.. ఇంటర్నెట్ సేవలు నిలిపివేసి.. ఎక్కడికక్కడే రైతులను అక్ర మ అరెస్టులు చేస్తుంటే.. ఆ వార్తలు ఎక్కడా మీడియాలో రాకుండా జాగ్రత్తపడ్డారు. దానిని కూడా డైవర్ట్ చేసేలా 'సురేశ్‌తో బీఆర్ఎస్ నేత, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి 40 సార్లు మాట్లాడా డు.. అతను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో 6 సార్లు మాట్లా డాడు' అంటూ పోలీసులు ఇచ్చే లీకులతో మీడియా మొత్తం నానా హడావిడి చేసింది.

కుట్రను ఆపాదించే కుయుక్తులు

కాంగ్రెస్ పార్టీ అనుకూల మీడియా మొత్తం పోలీసులు ఇచ్చే లీకులతో బ్రేకింగ్‌లు వేస్తూ.. ఎంతో ప్రధానమైన సమస్యను పక్కదారి పట్టించే ప్రయత్నం చేశారు. ఈ ఆందోళనకు ఆద్యులు బీఆర్ఎస్ నేతలే అంటూ ముఖ్యమంత్రి తమ్ముడి అనుకూల చానల్, మరో కాంగ్రెస్ నేతకు చెందిన చానళ్లు నాన్‌స్టాప్‌గా వార్తలు వండి వార్చారు. సీఎం తమ్ముడి చానెలైతే.. ఒక అడుగు ముందుకేసి వారికి చెందిన యూట్యూబ్ చానల్‌లో 'కేటీఆర్ నిందితుడు.. అతనే దాడులకు ఉసిగొల్పిండు' అంటూ పెద్దపెద్ద థంబ్‌నెల్స్ పెట్టి ఆయా వాట్సాప్ గ్రూపుల్లో విస్తృతంగా పోస్టు చేశారు. 'నాపై ఎలాంటి దాడి జరగలేదు' అని స్వయంగా వికారాబాద్ కలెక్టర్ మీడియాకు చెప్పినా కూడా.. 'కలెక్టర్‌పై దాడి' అంటూ ప్రజా ఆందోళనను పక్కదారి పట్టించడంలో ముఖ్యమంత్రి రేవంత్, వారి అనుకూల మీడియా మంగళవారం మొత్తం నిమగ్నమైంది.

పోలీసుల రహస్య నివేదికలు..

మీడియా డైవర్షన్ మొత్తం బీఆర్ఎస్‌పైనే ఉండటంతో డీజీపీ ఆదేశాల మేరకు పోలీసుశాఖ ఘటనపై రహస్యంగా విచారణ చేపట్టింది. లా అండ్ ఆర్డర్ ఏడీజీ మహేశ్ భగవత్, ఇంటెలిజెన్స్ పోలీసుల నేతృత్వంలో పోలీసులు రైతుల ఆందోళనలపై నివేదిక తయారు చేసినట్టుగా తెలిసింది. ఆ నివేదికలోనూ రాజకీయ పార్టీలకు ఎలాంటి సంబంధం లేదని, రైతులంతా కొన్ని నెలల తరబడి ఆ ఫార్మా కంపెనీలను వ్యతిరేకిస్తున్నారని, అందులో అన్ని పార్టీలకు చెందిన రైతులు ఉన్నారని వచ్చినట్టు తెలిసింది. ఆ నివేదికను సీఎస్ శాంతికుమారికి అందజేయగా ఆమె మంగళవారం సచివాలయంలో ఐజీ సత్యనారాయణ, వికారాబాద్ ఎస్పీ, కలెక్టర్‌లతో సమావేశమై సుదీర్ఘంగా చర్చించినట్టు తెలిసింది. అనంతరం ఆ నివేదికపై మంత్రి శ్రీధర్‌బాబు కూడా సమీక్షించినట్టుగా తెలిసింది. మొత్తానికి ఒక్క లగచర్ల ఆందోళనను డైవర్ట్ చేయడానికి కాంగ్రెస్ అనుకూల మీడియా నానా తంటాలు పడిందని కొందరు బీఆర్ఎస్ నాయకులు అంటున్నారు.

లంబాడీ రైతులను విడుదల చేయాలి

లంబాడీ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు రాంబాల్

హైదరాబాద్, నవంబర్ 12 (నమస్తే తెలంగాణ): ఫార్మా కంపెనీ ఘటనలో అర్ధరాత్రి అక్రమంగా అరెస్టు చేసిన యువకులు, రైతులను వెంటనే విడుదల చేయాలని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాంబాల్ నాయక్ డిమాండ్ చేశారు. తమ భూములు లాక్కోవద్దని రైతులు ఎంత వేడుకున్నా ప్రభుత్వం కనికరించడం లేదని తెలిపారు. అధికారులను సైతం బతిమాలిన వినకపోవడంతోనే రైతులు ఆగ్రహించాల్సి వచ్చిందని వెల్లడించారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గంలో లంబాడీలపై దాడులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. పచ్చని పొలాల్లో ఫార్మా చిచ్చు పెట్టొద్దని, కంపెనీ ఏర్పాటుపై ప్రభుత్వం వెనక్కి తగ్గాలని రాంబాల్ నాయక్ సూచించారు.



డీజీపీకి వినతిపత్రం అందిస్తున్న తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వీ లచ్చిరెడ్డి తదితరులు

దాడి చేసినవారిపై చర్యలు తీసుకోవాలి

- డీజీపీకి టీఈజేఏసీ, టీజీవో వినతి

హైదరాబాద్, నవబర్ 12 (నమస్తే తెలంగాణ) : ఉద్యోగులపై దాడులు మంచి పద్ధతి కాదని, వికారాబాద్ జిల్లాలో అధికారులు, ఉద్యోగులపై దాడిచేసినవారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వీ లచ్చిరెడ్డి కోరారు. ఆయన ఆధ్వర్యంలో పలువురు ఉద్యోగులు డీజీపీ జితేందర్‌ను మంగళవారం కలిసి వినతిపత్రం ఇచ్చారు. దాడికి పాల్పడిన వారు ఎంతటి వారైనా వదిలే ప్రసక్తిలేదని.. పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్టు డీజీపీ చెప్పారని జేఏసీ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు కే రామకృష్ణ, ఎస్.రాములు, రమేశ్ పాక, సెక్రటరీ జనరల్ పూల్ సింగ్‌చౌహన్, రాధ, తెలంగాణ నిర్మల, చంద్రశేఖర్‌గౌడ్, రాబర్ట్ బ్రూస్, పుష్పలత, తిరుపతి